29-11-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - మీ బుద్ధిని మరియు ఆలోచనలను ఎంత శుద్ధంగా, స్వచ్ఛంగా తయారుచేసుకోండి అంటే వాటి ద్వారా శ్రీమతాన్ని యథార్ధ రీతిలో ధారణ చేసి తండ్రి పేరును ప్రఖ్యాతం చేయగలగాలి"

ప్రశ్న:- పిల్లల యొక్క ఏ అవస్థ తండ్రిని ప్రత్యక్షము చేస్తుంది?

జవాబు:- ఎప్పుడైతే పిల్లల అవస్థ నిరంతరం హర్షితముఖంగా, అచలంగా-చలించకుండా, స్థిరంగా మరియు నిమగ్నమై ఉంటుందో, అప్పుడు తండ్రిని ప్రత్యక్షము చేయగలుగుతారు. ఇటువంటి ఏకరస అవస్థ కల తెలివైన పిల్లలే యథార్థ రీతిలో అందరికీ తండ్రి పరిచయాన్ని ఇవ్వగలుగుతారు.

పాట:- నీ దారిలోనే మరణించాలి... (మర్నా తేరీ గలీ మే...)

ఓం శాంతి. పిల్లలు పాటను విన్నారు. జీవిస్తూనే మరణించేందుకు నీ ద్వారము వద్దకు వచ్చాము అని అంటారు. ఎవరి ద్వారం వద్దకు వచ్చారు? మళ్ళీ ఇదే విషయము వెలువడుతుంది - ఒకవేళ గీతా భగవంతుడు శ్రీకృష్ణుడు అని అన్నట్లయితే ఈ విషయాలన్నీ ఉండవు. శ్రీకృష్ణుడు ఇక్కడ ఉండలేరు, వారు సత్యయుగ రాజకుమారుడు. గీతను శ్రీకృష్ణుడేమీ వినిపించలేదు, గీతను పరమపిత వినిపించారు. మొత్తం ఆధారమంతా ఈ ఒక్క విషయంపై ఉంది. భక్తిలో మీరు ఎంతో కష్టపడుతూ వచ్చారు. అదేమీ అవసరం లేదు. ఇది కేవలం ఒక్క క్షణము యొక్క విషయము. కేవలం ఈ ఒక్క విషయాన్ని నిరూపించేందుకు కూడా తండ్రి ఎంతగా కష్టపడవలసి ఉంటుంది, ఎంతగా జ్ఞానాన్ని ఇవ్వవలసి ఉంటుంది. ప్రాచీన జ్ఞానమునేదైతే భగవంతుడు ఇచ్చారో అదే నిజమైన జ్ఞానము, మొత్తం విషయమంతా గీతపైనే ఆధారపడి ఉంది. పరమపిత పరమాత్మయే వచ్చి దేవీ-దేవతా ధర్మాన్ని స్థాపన చేయడానికి సహజ రాజయోగాన్ని మరియు జ్ఞానాన్ని నేర్పించారు, అది ఇప్పుడు కనుమరుగైపోయింది. శ్రీకృష్ణుడు మళ్ళీ ఎప్పుడైనా వచ్చి గీతను వినిపిస్తారని మనుషులు భావిస్తారు. కానీ ఇప్పుడు మీరు సృష్టిచక్రము యొక్క చిత్రము ద్వారా బాగా నిరూపించాలి - గీతను జ్ఞానసాగరుడైన పారలౌకిక పరమపిత పరమాత్మయే వినిపించారు అని. శ్రీకృష్ణుని మహిమ వేరు, పరమపిత పరమాత్ముని మహిమ వేరు. శ్రీకృష్ణుడు సత్యయుగ రాజకుమారుడు, వారు సహజ రాజయోగము ద్వారా రాజ్యభాగ్యాన్ని పొందారు. చదువుకునే సమయంలో అతని నామరూపాలు వేరు మరియు ఎప్పుడైతే రాజ్యాన్ని పొందారో, అప్పటి నామరూపాలు వేరు - ఇది నిరూపించి చెప్పాలి. పతిత-పావనుడు ఒక్క తండ్రే. ఇప్పుడు మళ్ళీ శ్రీకృష్ణుని ఆత్మ పతిత-పావనుడి ద్వారా రాజయోగాన్ని నేర్చుకుని భవిష్య పావన ప్రపంచానికి రాజకుమారునిగా అవుతోంది. ఇది నిరూపించి చెప్పేందుకు కూడా యుక్తులు కావాలి. విదేశీయులకు కూడా నిరూపించి చెప్పవలసి ఉంటుంది. నెంబర్ వన్ గీత. సర్వ శాస్త్రమయి శ్రీమత్ భగవత్ గీతా మాత. ఇప్పుడు మాతకు ఎవరు జన్మనిచ్చారు? తండ్రే మాతను దత్తత తీసుకుంటారు కదా. గీతను ఎవరు వినిపించారు? క్రైస్ట్ బైబిల్ ను దత్తత తీసుకున్నారు అని అనరు, క్రైస్ట్ ఏ శిక్షణనైతే ఇచ్చారో దానిని మళ్ళీ బైబిల్ గా తయారుచేసి చదువుకుంటారు. ఇప్పుడు గీతా శిక్షణను ఎవరు ఇచ్చారు. దానిని తర్వాత పుస్తకముగా తయారుచేసి చదువుకుంటూ ఉంటారు. దీని గురించి ఎవరికీ తెలియదు. మిగిలిన శాస్త్రాలన్నింటి గురించి తెలుసు. ఈ సహజ రాజయోగ శిక్షణ ఏదైతే ఉందో, దీనిని ఎవరు ఇచ్చారు అన్నది నిరూపించాలి. ప్రపంచమైతే రోజురోజుకు తమోప్రధానముగా అవుతూ ఉంటుంది. ఈ విషయాలన్నీ స్వచ్ఛమైన బుద్ధిలోనే కూర్చోగలవు. ఎవరైతే శ్రీమతంపై నడవరో వారికి ధారణ జరగదు. అటువంటివారికి శ్రీమతము చెప్తుంది - మీరు ఏమాత్రమూ అర్థం చేయించలేరు, స్వయాన్ని జ్ఞానీగా భావించకండి. మొట్టమొదట - గీతా భగవంతుడు పరమపిత పరమాత్మయే అని, వారే పతిత-పావనుడని నిరూపించాలి. మనుష్యులైతే సర్వవ్యాపి అని అనేస్తారు లేక బ్రహ్మతత్త్వము లేక సాగరము అని అనేస్తారు. అర్థం లేకుండా ఏది తోస్తే అది అనేస్తారు. పొరపాటు అంతా గీత నుండే వెలువడింది, గీతా భగవంతుడు శ్రీకృష్ణుడు అని అనేశారు. కావున అర్థం చేయించేందుకు గీతను చేపట్టవలసి ఉంటుంది. గీతా భగవంతుడు శ్రీకృష్ణుడు కాదు అని బెనారస్ లో నిరూపించి చెప్పండి అని బెనారస్ లో ఉండే గుప్తాజీకి కూడా చెప్పేవారు. ఇప్పుడు సమ్మేళనాలైతే జరుగుతూ ఉంటాయి. ఏ ఉపాయాన్ని ఆలోచించినట్లయితే శాంతి ఏర్పడగలదు అని ధార్మిక మనుష్యులు అంటూ ఉంటారు. ఇప్పుడు శాంతిని స్థాపన చేయడమనేది పతిత మనుష్యుల చేతిలోనైతే లేదు. పతిత-పావనా రండి అని అంటూ ఉంటారు కూడా. అయినా పతితులు శాంతి స్థాపనను ఎలా చేయగలరు, వారే స్వయం పిలుస్తూ ఉంటారు కానీ పతితుల నుండి పావనులుగా తయారుచేసే తండ్రి గురించి తెలియనే తెలియదు. భారత్ పావనముగా ఉండేది, ఇప్పుడు పతితముగా అయింది. ఇప్పుడు పతిత-పావనుడు

ఎవరు? ఇది ఎవరి బుద్ధిలోకి రాదు. రఘుపతి రాఘవ రాజారాం... అని అంటూ ఉంటారు. ఇప్పుడు ఆ రాముడైతే లేరు. అసత్యముగా పిలుస్తారు, ఏమీ తెలియదు. ఇప్పుడు ఈ విషయాన్ని వారికి ఎవరు తెలియజేయాలి? చాలా మంచి పిల్లలు కావాలి. అర్థం చేయించేందుకు మంచి యుక్తి కావాలి. పెద్ద చక్రాన్ని కూడా తయారుచేయించారు, దాని ద్వారా గీతను భగవంతుడు రచించారు అన్నది నిరూపణ అవుతుంది. వారేమంటారంటే - ఎవరైనా సరే, అందరూ భగవంతులే కదా. తండ్రి అంటారు - మీరు అవివేకులు. నేను వచ్చి పావన రాజ్యాన్ని స్థాపన చేసాను, దానికి బదులుగా శ్రీకృష్ణుని పేరును వేసేశారు. పతితముగా ఉన్నవారినే పావనముగా తయారుచేసి మొదటి రాజకుమారునిగా తయారుచేస్తాను. భగవానువాచ - నేను శ్రీకృష్ణుని ఆత్మను దత్తత తీసుకుని బ్రహ్మగా చేసి అతని ద్వారా జ్ఞానాన్ని ఇస్తాను. అతనే మళ్ళీ ఈ సహజ రాజయోగము ద్వారా సత్యయుగ మొదటి రాజకుమారునిగా అవుతారు. ఈ వివరణ ఇంకెవ్వరి బుద్ధిలోనూ లేదు.

మీరు మొదట - శ్రీమత్ భగవత్ గీత సర్వ శాస్త్రాలకు మాతా-పిత వంటిది అన్నది నిరూపించి చూపించాలి. దాని రచయిత ఎవరు? ఏ విధంగా క్రైస్ట్ బైబిల్ కు జన్మనిచ్చారు, అది క్రిస్టియన్ ధర్మశాస్త్రము. అచ్చా! బైబిల్ కు తండ్రి ఎవరు? క్రైస్ట్. బైబిల్ ను మాతా-పిత అని అనరు. అక్కడ తల్లి విషయమే లేదు. ఇక్కడ వీరు మాత-పిత. క్రిస్టియన్లు శ్రీకృష్ణుని ధర్మముతో పోటీ పడ్డారు. వాస్తవానికి వారు క్రైస్టును నమ్ముతారు. ఏ విధంగా బుద్ధుడు ధర్మస్థాపన చేశారు కావున బౌద్ధుల శాస్త్రము కూడా ఉంది. ఇప్పుడు గీతను ఎవరు వినిపించారు? దాని ద్వారా ఏ ధర్మస్థాపన జరిగింది? ఇది ఎవరికీ తెలియదు. పతిత-పావనుడైన పరమపిత పరమాత్మ జ్ఞానాన్ని ఇచ్చారు అని ఎప్పుడూ అనరు. ఇప్పుడు చక్రాన్ని ఎలా తయారుచేసారంటే, దాని ద్వారా తప్పకుండా పరమపిత పరమాత్మ జ్ఞానాన్ని ఇచ్చారు అన్నది అర్థం చేసుకోగలుగుతారు. రాధా-కృష్ణులైతే సత్యయుగంలో ఉన్నారు. వారు తమకు తామే జ్ఞానాన్ని ఇచ్చుకోలేదు. జ్ఞానాన్ని ఇచ్చేవారు మరొకరు కావాలి. ఎవరో అయితే వారిని పాస్ చేయించి ఉంటారు. ఈ రాజ్యాన్ని ప్రాప్తిజేయించే జ్ఞానాన్ని ఎవరు ఇచ్చారు? భాగ్యము దానంతటదే తయారవ్వదు. భాగ్యాన్ని తయారుచేయడానికి అయితే తండ్రి లేక టీచరు కావాలి. గురువు గతిని ఇస్తారు అని అంటారు. కానీ గతి, సద్గతులు అర్థాన్ని కూడా అర్థం చేసుకోరు. ప్రవృత్తి మార్గమువారి సద్గతి జరుగుతుంది, ఇకపోతే గతి అనగా అందరూ తండ్రి వద్దకు వెళ్తారు. ఈ విషయాలను ఎవ్వరూ అర్థం చేసుకోరు. వారైతే భక్తి మార్గములో చాలా పెద్ద-పెద్ద దుకాణాలను తెరుచుకుని కూర్చున్నారు. సత్యమైన జ్ఞాన మార్గపు దుకాణము ఇదొక్కటే, మిగిలినవన్నీ భక్తి మార్గపు దుకాణాలే. తండ్రి అంటారు, ఈ వేద-శాస్త్రాలు మొదలైనవన్నీ భక్తి మార్గపు సామాగ్రియే. ఈ జప-తపాదులు, వేద-శాస్త్రాలు మొదలైనవాటిని అధ్యయనం చేయడం ద్వారా నేను లభించను. నేను పిల్లలకు జ్ఞానాన్ని ఇచ్చి పావనంగా తయారుచేస్తాను. నేను మొత్తం సృష్టి అంతటికీ సద్గతిదాతను. గతిలోకి వెళ్ళి మళ్ళీ సద్గతిలోకి రావాలి. అందరూ సత్యయుగములోకి రారు. ఈ డ్రామా తయారుచేయబడి ఉంది. కల్పపూర్వము మీకు ఏదైతే నేర్పించారో, ఏ చిత్రాలనైతే తయారుచేయించారో, వాటిని ఇప్పుడు తయారుచేయిస్తున్నారు.

మూడు ధర్మాల కాళ్ళపై సృష్టి నిలబడి ఉందని మనుష్యులంటారు. ఒక్క దేవతా ధర్మం యొక్క కాలు విరిగిపోయి ఉంది, కావుననే కదులుతూ ఉంటుంది. మొదట ఒకటే ధర్మం ఉంటుంది, దానిని అద్వైత రాజ్యం అని అంటారు. ఆ తర్వాత ఆ ఒక్క కాలు తొలగిపోయి మూడు కాళ్ళు వెలువడుతాయి, వాటిలో ఏ విధమైన శక్తి ఉండదు, పరస్పరము గొడవలు-కొట్లాటలు జరుగుతూ ఉంటాయి. నాథుని గురించి తెలియనే తెలియదు. అనాథలుగా అయిపోయారు. అర్థం చేయించేందుకు ఎంతో యుక్తి కావాలి. ప్రదర్శనీలో కూడా - గీతా భగవంతుడు శ్రీకృష్ణుడు కాదు, పరమపిత పరమాత్మ అని అర్థం చేయించాలి. వారి జన్మస్థానము భారత్. శ్రీకృష్ణుడు సాకారుడు, వారేమో నిరాకారుడు, వారి మహిమ పూర్తిగా వేరు. ఈ విధంగా యుక్తిగా కార్టూన్ తయారుచేయాలి, తద్వారా గీతను ఎవరు వినిపించారు అన్నది నిరూపణ అవ్వాలి. అంధుల ముందు పెద్ద అద్దాన్ని పెట్టాలి. ఇది అంధుల ముందు అద్దము వంటిది. ఎక్కువగా టూ మచ్ లోకి వెళ్ళకూడదు. ఇది చాలా పెద్ద పొరపాటు. పరమపిత పరమాత్ముని మహిమ వేరు, వారికి బదులుగా శ్రీకృష్ణునికి మహిమను చూపించారు. లక్ష్మీ-నారాయణుల చిత్రములో కింద రాధా-కృష్ణులు ఉన్నారు. వారే మళ్ళీ లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. లక్ష్మీ-నారాయణులు సత్యయుగములో ఉంటారు, సీతా-రాములు త్రేతాలో ఉంటారు. మొదటి నంబరు బిడ్డ శ్రీకృష్ణుడు, అతడిని మళ్ళీ ద్వాపరయుగములోకి తీసుకువెళ్ళారు. ఇవన్నీ భక్తి మార్గములో రచింపబడి ఉన్నాయి. విదేశీయులకు ఈ విషయాల గురించి ఏమి తెలుసు. డ్రామా అనుసారంగా ఈ జ్ఞానం ఎవరి వద్దా లేదు. జ్ఞానాన్ని పగలు అని, భక్తిని రాత్రి అని అంటారు. బ్రహ్మ యొక్క పగలు మరియు బ్రహ్మ యొక్క రాత్రి. సత్యయుగాన్ని స్థాపన చేసేవారు ఎవరు? బ్రహ్మ ఎక్కడి నుండి వచ్చారు? సూక్ష్మవతనములోకి ఎక్కడి

నుండి వచ్చారు? పరమపిత పరమాత్మయే సూక్ష్మ సృష్టిని రచిస్తారు. అక్కడ బ్రహ్మను చూపిస్తారు. కానీ అక్కడ ప్రజాపిత బ్రహ్మ ఉండరు. తప్పకుండా ప్రజాపిత బ్రహ్మ వేరు. వారు ఎక్కడి నుండి వచ్చారు, ఈ విషయాలను ఎవ్వరూ అర్థం చేసుకోలేరు. శ్రీకృష్ణుని అంతిమ జన్మలో వారిని పరమాత్మ తమ రథముగా చేసుకున్నారు, ఇది ఎవరి బుద్ధిలోనూ లేదు.

ఇది చాలా ఉన్నతమైన క్లాస్. ఫలానా స్టూడెంట్ ఎలా ఉన్నారు అన్నది టీచర్ అయితే అర్థంచేసుకోగలరు కదా, మరి తండ్రి అర్థం చేసుకోలేరా? ఇది అనంతమైన తండ్రి యొక్క క్లాస్. ఇక్కడి విషయమే వేరు. శాస్త్రాలలో ప్రళయము మొదలైనవి చూపించి ఎంత తికమకను సృష్టించారు. ఎంత గర్వముంది. రామాయణము, గీత మొదలైనవి ఎలా కూర్చుని వినిపిస్తారు. శ్రీకృష్ణుడైతే గీతను వినిపించలేదు. వారు గీత జ్ఞానాన్ని విని రాజ్య పదవిని పొందారు. వీరు గీతా భగవంతుడు, వీరి గుణాలు ఇవి మరియు శ్రీకృష్ణుడి గుణాలు ఇవి అని నిరూపించి అర్థం చేయిస్తారు. ఈ పొరపాటు కారణముగానే భారత్ గవ్వతుల్యముగా అయ్యింది. మాతలైన మీరు వారికి ఇలా చెప్పవచ్చు - మీరు మాత నరకానికి ద్వారము అని అంటారు కదా, కానీ పరమాత్మ అయితే జ్ఞాన కలశాన్ని మాతలపై ఉంచారు, మాతలే స్వర్గానికి ద్వారముగా అవుతారు, మీరేమో నిందిస్తున్నారు. కానీ ఈ విధంగా చెప్పేవారు చాలా తెలివైనవారై ఉండాలి. పాయింట్లన్నీ నోట్ చేసుకుని అర్థం చేయించాలి. భక్తి మార్గము వాస్తవానికి గృహస్థుల కొరకు ఉంది. ఇది ప్రవృత్తిమార్గపు సహజ రాజయోగము. మనము నిరూపించి అర్థం చేయించడానికి వచ్చాము. పిల్లలు ప్రత్యక్షము చేయాలి. సదా హర్షితముఖులుగా, అచలంగా, స్థిరంగా, మగ్నమై ఉండాలి. మున్ముందు మహిమ తప్పకుండా వెలువడనున్నది. మీరందరూ బ్రహ్మకుమార-కుమారీలు. ఎవరైతే 21 జన్మల కొరకు తండ్రి నుండి వారసత్వాన్ని ప్రాప్తింపజేస్తారో, వారే కుమారీ. కుమారీల మహిమ చాలా గొప్పగా ఉంది. ముఖ్యమైన కుమారీ మీ మమ్మా. చంద్రుని ముందు మంచి నక్షత్రము కూడా కావాలి. వీరు జ్ఞానసూర్యుడు. ఈ గుప్తమైన మమ్మా వేరు. ఈ రహస్యాన్ని పిల్లలైన మీరే అర్థం చేసుకుని అర్థం చేయించగలరు. ఆ మమ్మా పేరు వేరు, మందిరాలు ఆమెవే. ఈ గుప్తమైన వృద్ధమాతకు మందిరాలు ఏమైనా ఉన్నాయా. ఈ మాతా-పిత కంబైండ్ గా ఉన్నారు. ప్రపంచానికి ఈ విషయాలు తెలియవు. శ్రీకృష్ణుడు ఈ స్థానములో ఉండరు, అతను సత్యయుగ రాజకుమారుడు. శ్రీకృష్ణుడిలోకి భగవంతుడు రాలేరు. ఇది అర్థం చేయించడం చాలా సహజము. గీతా భగవానుడి మహిమ వేరు. ఆ పతిత-పావనుడు మొత్తం ప్రపంచానికి మార్గదర్శకుడు, ముక్తిప్రదాత. తప్పకుండా పరమాత్ముని మహిమ వేరు అని మనుష్యులు చిత్రాల ద్వారా అర్థం చేసుకుంటారు, అందరూ ఒకే విధంగా ఉంటారా. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ అవస్థను చాలా నిమగ్నమై ఉన్నట్లుగా, అచలంగా-చలించకుండా ఉండేలా తయారుచేసుకోవాలి. సదా హర్షితముఖులుగా ఉండాలి.

2. జ్ఞానము యొక్క శుద్ధమైన గర్వములో (నషాలో) ఉంటూ తండ్రిని ప్రత్యక్షము చేయాలి. గీతా భగవానుడిని నిరూపించి తండ్రి యొక్క సత్య పరిచయాన్ని ఇవ్వాలి.

వరదానము:- స్మృతి స్వరూపులుగా అయి విస్మృతిలో ఉన్నవారికి స్మృతిని కలిగించే సత్యమైన సేవాధారీ భవ

మీ స్మృతి స్వరూపపు ఫీచర్స్ ద్వారా ఇతరులను స్మృతి స్వరూపులుగా తయారుచేయడము, ఇదే సత్యమైన సేవ. మీ ఫీచర్స్ ఇతరులకు - నేను ఆత్మను అన్న స్మృతిని కలిగించాలి మరియు వారు మస్తకములో మెరుస్తూ ఉన్న ఆత్మను లేక మణిని మాత్రమే చూడాలి. ఏ విధంగా సర్పము తలపైనున్న మణిని చూస్తున్నప్పుడు సర్పము వైపుకు ఎవరి ధ్యాస వెళ్ళదో, అలాగే అవినాశీగా మెరుస్తూన్న మణిని చూస్తూ దేహభానాన్ని మర్చిపోవాలి, అటెన్షన్ స్వతహాగానే ఆత్మ వైపుకు వెళ్ళాలి. విస్మృతిలో ఉన్నవారికి స్మృతి కలగాలి - అప్పుడే సత్యమైన సేవాధారి అని అంటారు.

స్లోగన్:- అవగుణాలను ధారణ చేసే బుద్ధిని సమాప్తం చేసి సతోప్రధాన దివ్యబుద్ధిని ధారణ చెయ్యండి.